
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 21 । డిసెంబర్ । 2023



సర్పంచ్‌ల సతమతం..
పంచాయతీల్లో నిధుల్లేక పనులు ఎక్కడిక క్కడే ఆగిపోయాయి. దీంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లు సతమతం అవుతున్నారు. 8లో



పశువులు లేవు..
వ్యవసాయంలో యాంత్రీకరణ పెరుగుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పశు సంపద కనమరుగవుతోంది. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం 28° / 16°
జిల్లాలో గురువారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి వేళ చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మగుడిలో హుండీ లెక్కింపు

86 రోజులకు రూ.26.72 లక్షల ఆదాయం



అమ్మవారి కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

పాల్వంచ: మండల పరిధిలోని శ్రీ కనకదుర్గ దేవస్థానం(పెద్దమ్మగుడి)లో భక్తులు అమ్మ వారికి సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. ఆలయ ఈఓ రజిని కుమారి, చైర్మన్ మహిపతి రామలింగం,, కొత్తగూడెం డివిజన్ పరిశీలకుడు పి.ఖేల్ సింగ్ పర్యవేక్ష ణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గత ఆగస్టు 25వ తేదీ నుంచి ఈ నెల 19వ తేదీ వరకు 86 రోజుల కానుకలను లెక్కించగా, రూ.26,72,768 లక్షల ఆదాయం లభించింది. మిశ్రమ బంగారం 430 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, వెండి 5 కిలోల 15 గ్రాములు వచ్చాయి. కరూర్ వైశ్య బ్యాంక్, పోలీస్, ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు సందుపట్ల శ్రీనివాస రెడ్డి, ఎస్‌వీఆర్‌కె.ఆచార్యు లు, కాటారాపు లక్ష్మీనారాయణ, సంకా వెంక టరమారావు, గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్లపాడు నర్సరీ పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న పీఓ ప్రతీక్ జైన్

చుంచుపల్లి: మండల పరిధిలోని ప్రశాంతినగర్ గ్రామపంచాయతీ గరిమెళ్లపాడు గ్రామాన్ని, అక్కడి నర్సరీని బుధవారం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ సందర్శించారు. గ్రామస్తులతో మాట్లా డారు. గరిమెళ్లపాడుకు రహదారి ప్రతిపాదన కోసం రైల్వే ట్రాక్‌పై వంతెన, నర్సరీలో మామిడి, జామ, తోటల అభివృద్ధి, స్థానికులకు ఉపాధి తదితర అంశాలపై మండల అధికారుల తో చర్చించారు. తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారా యణ, సర్పంచ్ పద్మ, ఐటీడీఏ ఏపీఓ (సాధార ణ) సురేష్, పంచాయతీ కార్యదర్శులు రఘు, పాషా, ఉపేందర్, ఈజీఎస్ ఏపీఓ రఘుపతి, ఈసీలు పిల్లి నాగరాజు, అనిల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పరంధామరెడ్డి

సింగరేణి(కొత్తగూడెం): జిల్లా అథ్లెటిక్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో రుద్రంపూర్‌లోని ప్రొ ఫెసర్ జయశంకర్ గ్రౌండ్స్‌లో బుధవారం సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశే ఖర్‌రావు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, జిల్లా యువజన క్రీడల శాఖాధికారి ఎం. పరంధామరెడ్డి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్‌కు అనువైన స్థలం సేక రించి నిర్మాణం చేస్తామని తెలిపారు. పోటీలకు 300 మంది క్రీడాకారులు హాజరై సత్తా చూపారు. అనంతరం విజేతలకు బహుమతు లు అందజేశారు. ఇక్కడ ఎంపికైనవారిని జనవ రిలో గుజరాత్‌లో జాతీయ పోటీలకు పంపించ నున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, జిల్లా అథ్లె టిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కే. మహి ధర్, రాసపల్లి రాజేందర్‌ప్రసాద్, కాశీ హుస్సేన్, ఆదినారాయణ, పి. నాగేందర్, సనంద కోరి, జన్ను, గిరి ప్రసాద్, అక్బర్, సిం ధు, బి.నాగమణి పాల్గొన్నారు.

పొరపాట్లను సరిచేసుకోవాలి

సుజాతనగర్: సీసీఐ కేంద్రంలో జరుగుతున్న పొరపాట్లను సరిచేసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా కోరారు. బుధ వారం సీపీఐ నాయకులు జిన్నింగ్ మిల్లును సందర్శించారు. పత్తి కొనుగోళ్లను పరిశీలిం చారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లా డుతూ తరుగు విషయంలో నిబంధనలను సడ లించాలన్నారు. రైతుల ద్వారా ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు అందిన ఫిర్యాదు లను సరిచేసుకోవాలని అన్నారు. సీపీఐ జిల్లా నాయకుడు సలిగంటి శ్రీనివాస్ మండల కార్య దర్శి భూక్య దస్రు, నాయకులు కొమారి హను మంతరావు, జక్కుల రాములు, వేల్పుల భాస్కర్, తాళ్లూరి ధర్మారావు, బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటికి సిద్ధం



ఉత్తర ద్వార దర్శనం తలుపునకు తుది మెరుగులు..

సర్వాంగ సుందరంగా భద్రగిరి రామాలయం

- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు
- భక్తుల కోసం 2 లక్షల లడ్డూలు తయారీ
- ముందస్తు టికెట్ల విక్రయానికి విశేష స్పందన

భద్రాచలం: ముక్కోటి ఉత్సవాలకు సర్వం సిద్ధమైం ది. శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వ ర్యంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలలో భాగంగా ఈ నెల 22న రాత్రి గోదావరిలో హంసవాహనంపై రామయ్య తెప్పోత్సవం నిర్వహించనున్నారు. 23న తెల్లవారు జామున ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం జరపనున్నారు. దీంతో ఈఓ రమాదేవి ఆధ్వర్యంలో అధికారులు దాదాపుగా ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం, మిథిలా స్టేడియం పరిసర ప్రాంతాల్లో చలువ పందిళ్లు, షామియా నాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో అలంక రిస్తున్నారు. తెప్పోత్సవం జరిపే హంసవాహనం ట్రయల్ రన్ పూర్తి చేశారు. ఉత్తర ద్వార దర్శనం వీక్షణకు సెక్టార్ల వారీగా విభజనతోపాటు ప్రధాన ద్వారాల వద్ద తుది మెరుగులు దిద్దుతున్నారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పను లను ముమ్మరంగా సాగుతున్నాయి. కాగా ఏర్పా ట్లపై కలెక్టర్ ప్రియాంక ఆల పలుమార్లు సమీక్షలు జరిపారు. ఎస్పీ వినీత్‌తో కలిసి పర్యవేక్షించి పలు సూచనలు అందజేశారు.

వీఐపీల తాకిడితోనే అసలు సమస్య

ప్రతి ఏడాది వీఐపీల తాకిడితో సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తుతుంటాయి. దీనికి తోడు వీఐపీ సెక్టార్లలో అనుమతి లేని వ్యక్తులు ప్రవేశించి కిక్కి రిసి ఉండటం, నిలబడి వీక్షించడంతో వెనుక సెక్టా ర్లలో ఉన్న భక్తులు ఉత్తర ద్వార దర్శనంను వీక్షించే అవకాశం ఉండటం లేదు. ఈ సమస్యను అధికారు లు గుర్తించి నివారించాల్సి ఉంది. ఈ ఏడాది కొత్త గా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగా, అందు లోనూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రు లకు అవకాశం వచ్చింది. ఈ నేపథ్యంలో వేడుక లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తోపాటు దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సైతం హాజరయ్యే అకాశం ఉంది. ఈ క్రమంలో మంత్రుల అనుచరులు, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల ఎమ్మెల్యేలు సైతం పాల్గొననున్నారు. దీంతో రద్దీ పెరిగి సెక్టార్లు, అంతరాలయం వద్ద సామాన్య భక్తు లు ఇబ్బందులు పడే ఆస్కారం ఉంది. ఈ సమ స్యను దేవస్థానం, రెవెన్యూ, పోలీస్ ఇతర శాఖల అధికారులు గమనించి అధిగమించాలని పలువురు కోరుతున్నారు.

భారీగా రానున్న భక్తులు



లడ్డూలను తయారు చేస్తున్న సిబ్బంది

వేడుకలకు రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరానుండగా, ఆలయ అధికారులు రెం డు లక్షల లడ్డూలను సిద్ధం చేస్తున్నారు. లడ్డూల విక్రయానికి ఆరు కౌంటర్లు, నాలుగు ప్రదేశాలలో సమాచార కేంద్రాలు, విస్తా కాంప్లెక్స్ పక్కన ఉచిత వసతి సౌక ర్యం, ఎనిమిది ప్రదేశాల్లో ప్రథమ చికిత్సా కేంద్రాలు, పట్టణంలోని అన్ని ప్రధాన కూడ ళ్లలో తాగునీటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు.

ఫలించిన ముందస్తు ఆన్‌లైన్ టికెట్ల వ్యూహం

ప్రతి ఏడాది ముక్కోటి టికెట్ల విక్రయాలు తక్కు వగా ఉండటం, వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖ పరిధిలో ఉండటంతో దేవస్థాన ఆదాయా నికి భారీగా గండి పడుతోంది. కానీ ఈసారి ఈఓ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముందస్తు గా ఆన్‌లైన్‌లో టికెట్లను అందుబాటులో ఉంచ డంతోపాటు భద్రాచలం, కొత్తగూడెంలలో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.



సీఆర్‌ఓ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన టికెట్ల విక్రయ కేంద్రం

మరో రెండు రోజులు గడువు ఉండటంతో మొత్తం టికెట్లు అమ్ముడుపోతాయని దేవస్థానం అధికారులు భావిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో టికెట్ల విక్రయాల వివరాలు

టికెట్ విలువ	మొత్తం	విక్రయం
రూ.2 వేలు	600	381
రూ.వెయ్యి	300	207
రూ. 500	800	524
డి సెక్టార్	125	125
రూ. 250	500	167
విక్రయ కేంద్రాల్లో	.....	303

రైతుబంధు రూ.10.5 కోట్లు జమ

32,208 మంది రైతుల అకౌంట్లలో నగదు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతుబంధు నగదు జమ చేస్తోంది. జిల్లాలో 1,85,014 మంది రైతులు అర్హులు ఉండ గా, 5,10,572 ఎకరాలకు యాసంగి సీజన్‌లో రైతు బంధు పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలో మొత్తం రూ.2,78,25,31,121 పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 32,208 మంది రైతులకు రూ. 10,49,07,598 సొమ్ము జమ చేశారు. ఐదెకరాల వరకు సాగుభూమి ఉన్న రైతులు 1,55,410 మంది ఉండగా, వారి ఆధీనంలో 2,85,391 ఎకరాల 32 కుంటల భూమి ఉంది. వీరికి మొత్తం రూ.1,61,90,43,487 సొమ్ము జమ కానుంది. 5 ఎకరాల కంటే ఎక్కువ సాగుభూమి ఉన్న వారు 29,604 మంది ఉండగా, వారి ఆధీనంలో 2,25,180 ఎకరాల 31 కుంటల భూమి ఉందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వీరికి రూ 1,16,29,87,634 సొమ్ము జమ కానుంది. రాష్ట్రం లో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభు త్వం రైతుబంధు పథకం అమలు తీరుపై కసరత్తు చేస్తోంది. ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు అమలు చేయాలని నిర్ణయిస్తే ప్రభుత్వ ఖజానాకు పొదుపు చేసే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇప్పటివరకు జమఅయిన రైతుబంధు వివరాలు

మండలం	మొత్తం రైతులు	నగదు అందిన రైతులు	జమైన సొమ్ము (రూ.)
అన్నపురెడ్డిపల్లి	4,603	2,486	28,51,681
అశ్వారావుపేట	12,955	1,748	54,75,823
చంద్రుగొండ	5,894	1,425	45,44,167
దమ్మపేట	11,143	1,693	54,43,289
ములకలపల్లి	10,399	1,667	58,41,523
భద్రాచలం	111	15	21,136
చర్ల	11,574	3,157	94,79,785
దుమ్ముగూడెం	16,121	3,488	1,06,66,324
చుంచుపల్లి	731	204	6,14,623
జూలూరుపాడు	10,360	1,837	67,49,702
కొత్తగూడెం	265	186	2,43,687
లక్ష్మీదేవిపల్లి	4,591	1,813	22,31,962
పాల్వంచ	6,748	3,283	43,62,083
సుజాతనగర్	6,674	4,046	58,13,394
ఆళ్లపల్లి	5,225	970	8,72,625
అశ్వాపురం	8,218	4,778	61,31,068
బూర్గంపాడు	7,969	4,137	42,34,815
గుండాల	9,116	2,084	21,90,125
కరకగూడెం	5,215	2,139	28,58,811
మణుగూరు	3,498	2,249	31,56,316
పినపాక	6,719	3,902	5,61,10,376
టేకులపల్లి	14,836	5,914	78,24,195
ఇల్లెందు	14,571	6,106	76,90,098
మొత్తం	1,77,736	82,964	10,49,07,598

నేడు యువజనోత్సవాలు

కొత్తగూడెంటౌన్: 27వ జాతీయ యువజనోత్స వాలను పురస్కరించుకుని గురువారం జిల్లాస్థాయి లో యువజన కళాకారుల ఎంపికల కోసం పోటీ లను నిర్వహించనున్నట్లు బుధవారం జిల్లా యువ జన క్రీడలశాఖ అధికారి పి.పరంధామరెడ్డి ఒక ప్రక టనలో తెలిపారు. కొత్తగూడెం క్లబ్‌లో ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సమాచార కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ముక్కోటి వైకుంఠ ఏకాదశి మహోత్సవాలకు వచ్చే భక్తులకు సమా చారం తెలిపేలా సమాచార పౌరసరఫరాల శాఖ రూపొందించిన కరపత్రాన్ని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల బుధవారం రాత్రి తన చాంబర్‌లో ఆవిష్కరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీపీఆర్‌ఓ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, మైనార్టీ సంక్షేమాధికారి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

1,200 మందితో ముక్కోటి బందోబస్తు

భద్రాచలంఅర్బన్: ఈ నెల 22, 23 తేదీల్లో జరిగే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం వేడకలకు వీవీఐపీలు, పలువురు ప్రముఖులు, అధిక సం ఖ్యలో భక్తులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో 1,200 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించ నున్నారు. బందోబస్తుకు వస్తున్న పోలీసులకు ఇప్ప టికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇద్దరు అడిషనల్ ఏఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 22 మంది సీఐలు, 65 మంది ఎస్‌ఐల తోపాటు ఏఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు విధులు నిర్వహించనున్నారు.

క్యూఆర్ కోడ్..

కొత్తగూడెంటౌన్: ముక్కోటి వైకుంఠ ఏకద శికి రావాలనుకునే భక్తు లకు సమస్త సమాచారం క్యూఆర్ కోడ్‌ను అందు బాటులోకి తెచ్చినట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. క్యూఆర్ కోడ్, https// mukkoti. netlify.app లింక్ ఉపయోగిం చి భద్రాచలానికి ఏ మార్గంలో రావాలి? ఎక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉంటుంది?, పార్కింగ్ స్థలాలు, లడ్డూ, ప్రసాదం స్టాల్స్, వైకుం ఠ ద్వార దర్శనం, సెక్టార్ల ప్లాన్ గురించి పూర్తి వివ రాలు తెలుసుకోవచ్చని వివరించారు.

విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలి

బూర్గంపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను మెరుగుపరచాలని, అందుకోసం విద్యాశాఖ అమలు చేస్తున్న ప్రత్యేక విధానాలను సమగ్రంగా అవలంబించాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు నాగరాజు శేఖర్, సైదులు, సతీష్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని పినపాక పట్టీనగర్ జెడ్పీఎస్‌ఎస్, బూర్గంపాడు కేజీబీవీ, టీఎస్ఆర్‌ఈఐఎస్ పాఠశాలలను బుధ వారం వారు సందర్శించారు. పాఠశాలల్లో అమల వుతున్న యూ-డైస్, ఉన్నతి, సీడబ్ల్యూఎస్‌ఎన్‌పై విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయు లకు తగు సూచనలు చేశారు. పాఠశాలలకు అం దించిన కంప్యూటర్లు, ప్రింటర్లను పరిశీలించారు. పాఠశాలల్లో ఎవరైనా సీడబ్ల్యూఎస్‌ఎన్ విద్యార్థులు ఉన్నట్లయితే వారి వివరాలు యూ-డైస్‌లో నమోదు చేయాలని సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

అభయ'హస్తం' అందేనా?

- పథకాన్ని రద్దు చేసిన గత ప్రభుత్వం
- జమ చేసిన సొమ్ము తిరిగి చెల్లిస్తామని హామీ
- అమలు చేయకపోవడంతో లబ్ధిదారుల నిరాశ
- కొత్త సర్కారుపై మహిళా సంఘాల ఆశలు

చుంచుపల్లి: గత ప్రభుత్వం అభయహస్తం పథ కాన్ని రద్దు చేసింది. ఆ పథకంలో మహిళలు చెల్లిం చిన నగదు తిరిగి ఇస్తామని రెండేళ్ల క్రితం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. దీంతో లబ్ధిదారు లు కొత్త ప్రభుత్వంపై ఆశ పెట్టుకున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు 60 ఏళ్ల తర్వాత పింఛన్ ఇచ్చేలా 2009లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అభయహస్తం పథకం ప్రవేశపెట్టారు. పర్యవేక్షణ బాధ్యతలను పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)కు అప్పగించారు. అర్హులు రోజుకు రూపాయి చొప్పున ఏడాదికి రూ.365 తమ వాటాను చెల్లించాలని, అంతే మొత్తంలో ప్రభుత్వం కూడా ప్రీమియం రూపంలో చెల్లించేలా నిబంధనలు రూపొందించారు. ఇలా పదేళ్లపాటు చెల్లిస్తే 60 ఏళ్లు దాటాక సభ్యులకు నెలకు రూ. 500 నుంచి రూ. 2,200 వరకు పింఛన్‌ను అందించేలా రూపకల్పన చేశారు. రెండేళ్లపాటు ఎవరైనా నగదు జమ చేయకపోతే సభ్యత్వాన్ని రద్దు చేస్తామని నిబంధన విధించారు. ఈ పథకంలో సభ్యులు చనిపోతే సహజ మరణానికి రూ.35 వేలు, ప్రమా దవశాత్తు మరణిస్తే రూ.75 వేలు చెల్లిస్తారు. దహన సంస్కారాలకు తక్షణ సహాయంగా మరో రూ.5 వేలను అందిస్తారు. సభ్యుల పిల్లలు చదువుకుంటే ఇద్దరికి 8,9,10 తరగతులతో పాటు, ఇంటర్ చదు వుకునే విద్యార్థులకు ఏడాదికి రూ.1,200 చొప్పున ఉపకార వేతనాన్ని అందిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో చదువుకున్నా ఈ సౌకర్యం ఉంటుంది.



మహిళా సంఘాల సభ్యులు(ఫైల్)

88,763 మంది లబ్ధిదారులు.. రూ.15.50 కోట్లు జమ

స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న 88,763 మంది మహిళలు ఈ పథకంలో చెల్లింపులు చేశారు. ఇలా 2014 వరకు సభ్యులు తమ వాటా చెల్లించారు. కొందరు పూర్తిస్థాయిలో జమ చేయగా, మరికొం దరు 1, 2 సంవత్సరాలు మాత్రమే చెల్లించి మానే శారు. ఇలా ఐదేళ్లపాటు జిల్లాలో రూ.15.50 కోట్ల ను పొదుపు రూపంలో జమ చేశారు. ఇందులో 60 ఏళ్లు నిండిన వారు 1,497 మంది ఉండగా వారికి నెలకు రూ. 500 చొప్పున పింఛన్ కూడా అందజే శారు. 2016–17 ఆర్థిక సంవత్సరం తర్వాత నుంచి రాష్ట్ర ప్రభుత్వం సభ్యుల నుంచి ప్రీమియం సొమ్మును వసూలు చేయలేదు. 2018 ఏప్రిల్ నుం చి అభయ హస్తం పింఛన్‌తోపాటు సభ్యుల పిల లకు ఇచ్చే స్కాలర్‌షిప్పులు, మరణానంతరం ఇచ్చే పరిహారం సొమ్మును కూడా నిలిపివేసింది. ఆ తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పథకం మొత్తానికే రద్దు చేసింది. సభ్యులు జమ చేసిన సొమ్ము తిరిగి ఇస్తామని ప్రకటించడంతో గతేడాది మార్చిలో సభ్యుల బాండు, బ్యాంకు అకౌంట్, ఆధార్ కార్డు, సెల్ నంబర్ తదితర వివరాలను అధికారులు సేక రించారు. కానీ చెల్లించలేదు. అభయహస్తం పింఛన్ పొందిన వారిలో ప్రస్తుతం చాలా మందికి ఆసరా పింఛన్ రూ. 2,016 అందుతోంది. వీరు కూడా తాము కట్టిన నగదు కోసం నిరీక్షిస్తున్నారు. గత ప్రభుత్వం సొమ్ము చెల్లించకపోవడంతో నిరాశకు గురయ్యారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అధికారంలోకి వచ్చింది. ఈ సర్కారైనా అభయహ స్తంలో తాము జమ చేసిన సొమ్ము చెల్లించాలని కోరుతున్నారు.

గతంలో వివరాలు పంపాం



అభయహస్తం పథకంలో ఉన్న మహిళలు చెల్లించిన డబ్బులు తిరిగి ఇవ్వాలని గత ప్రభు త్వం గతేడాది మార్చిలో ప్రక టించింది. దీంతో జిల్లావ్యాప్తం గా మహిళల బ్యాంకు ఖాతాల వివరాలను సేకరిం చి ప్రభుత్వానికి పంపాం. చెల్లింపుల వ్యవహారం ప్రభుత్వం పరిధిలో ఉంది.

–జి.మధుసూదన్‌రాజు, డీఆర్‌డీఓ

ఖమ్మంలో కరోనా కేసు నమోదు

ఖమ్మం వైద్యవిభాగం : ఇతర రాష్ట్రాల్లో కరోనా ఒమిక్రాన్ జేఎన్ -1 కొత్త వేరియెంట్ కేసులు నమో దవుతున్నాయి. ఈ క్రమంలో కోవిడ్‌ను ఎదుర్కొ నేందుకు అన్ని ఆస్పత్రుల్లో సిద్ధంగా ఉండాలని సిబ్బందికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం తొలి కరోనా కేసు నమోదైంది. ఆపరేషన్ చేయించు కునేందుకు వచ్చిన ఓ 55 ఏళ్ల వ్యక్తికి వివిధ రకాల పరీక్షలతో పాటు కోవిడ్ టెస్టు కూడా నిర్వహించగా పాజిటివ్ ఉన్నట్లు తేలింది. దీంతో అతడిని ఐసోలే షన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. కాగా ఖమ్మం జిల్లాలో కరోనా పాజిటివ్ కేసు చివరిసా రిగా ఈ ఏడాది మే 17న నమోదైంది. ఆ తర్వాత కోవిడ్ ప్రభావం లేకపోవటంతో పరీక్షలు నిలిపివే యడంతో పాటు ఐపీ వార్డులను కూడా మూసివే శారు. ఏడు నెలల తర్వాత మళ్లీ కేసు నమోదు కావ డంతో సేవలు ప్రారంభమయ్యాయి. బెడ్లు, మం దులు సిద్ధం చేశారు. కరోనా బాధితుల సంఖ్య పెరిగినా అందరికీ పూర్తి స్థాయిలో చికిత్స అందించే లా ఏర్పాట్లు చేశారు. చాలా నెలల తర్వాత బుధ వారం కోవిడ్ ఓపీ, ఐపీ సేవలను అందుబాటులోకి తెచ్చారు. కోవిడ్ ఐసోలేషన్ వార్డును తెరిచి గదు లు, బెడ్లు శుభ్రం చేశారు. ప్రస్తుతం 20 ఐసోలేషన్ బెడ్లు, 5 ఐసీయూ పడకలను సిద్ధంగా ఉంచారు. 2020లో కరోనా కేసులు ప్రారంభం నుంచి ఈ ఆస్పత్రిలో సేవలందించారు. మొదటి, రెండు వేవ్ ల్లో వందల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. అయి నా కోవిడ్ కట్టడికి ఆస్పత్రి అధికారులు, వైద్యులు, సిబ్బంది అహర్నిశలూ శ్రమించి వేలాది మంది ప్రాణాలు కాపాడారు. పలువురు వైద్యులు, సిబ్బం ది కరోనా బారిన పడినా ధైర్యంగా సేవలందించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు.

వైద్యారోగ్య శాఖ అప్రమత్తం..

కరోనా వ్యాప్తి చెందుతున్న తరుణంలో ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు వైద్య విధాన పరిషత్, జిల్లా వైద్యారోగ్య శాఖ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యు కేషన్ అధికారులు ముందస్తు చర్యలకు సిద్ధమ య్యారు. రెండు రోజుల్లో కిట్లు రానుండగా, ర్యాపిడ్ టెస్టులు చేయనున్నారు. ఆర్‌టీపీసీఆర్ టెస్టులు మాత్రం ఆదేశాలు వచ్చాకే నిర్వహించాలని నిర్ణ యించారు. ప్రైవేటు ఆస్పత్రులను కూడా అప్రమ త్తం చేస్తూ డీఎంహెచ్‌ఓ ఆదేశాలు జారీ చేశారు.

క్లుప్తంగా

అలరించిన నృత్య ప్రదర్శన



అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం వీక్షకులను అలరించాయి. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు శ్రీరామ పాదుకా పట్టాభిషేకం హరికథ, నాదార్చన, సంకీర్తన గానం చేయగా భక్తులను పులకించిపోయారు. ఉత్తమ ప్రదర్శన కనభరిచిన కళాకారులకు అవార్డులు అందజేశారు.

కాన్పుల సంఖ్య పెంచాలి

టేకులపల్లి: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్య పెంచాలని డీఎంహెచ్ఓ శిరీష తెలిపారు. బుధవారం సులానగర్ పీహెచ్‌సీలో వైద్యులు, స్టాఫ్ నర్సులకు జరుగుతున్న దక్షిత శిక్షణ శిబిరాన్ని ఆమె సందర్శించారు. వైద్య సిబ్బంది హై రిస్క్ ప్రెగ్నెన్సీలను ముందుగానే గుర్తించి చికిత్స అందించి సురక్షితంగా కాన్పులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ చైతన్య, డీపీహెచ్ఎన్ అన్నా మేరీ పాల్గొన్నారు.

డీలర్లకు శిక్షణ

కొత్తగూడెం రూరల్: జిల్లాలోని ఇన్‌పుట్ డీలర్ల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం లోతువాగు రైతు వేదికలో అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు ప్రారంభించారు. డీలర్లకు వ్యవసాయ పరిజ్ఞానం నేర్పే దిశగా డిప్లమో ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ (డీఏఈఎస్ఐ) కోర్సులో శిక్షణనిస్తున్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 48 వారాల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, అధికారులు కొర్సా అభిమన్యుడు, వి.లక్ష్మీనారాయణమ్మ, జినుగు మరియన్న, లాల్‌చంద్, దామోదర్‌రెడ్డి, దీపక్ ఆనంద్ పాల్గొన్నారు.

మూడు ఇసుక లారీలు పట్టివేత

అశ్వాపురం: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను అశ్వాపురం పోలీసులు బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. మణుగూరు మండలం సాంబాయిగూడెంలో గోదావరి నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను మండలంలోని గొల్లగూడెం గ్రామంలోని సీతారామ కెనాల్ వంతెన వద్ద అశ్వాపురం పోలీసులు పట్టుకుని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మణుగూరు ఇన్‌చార్జ్ తహసీల్దార్ ఒక్కో లారీకి రూ.10 వేల చొప్పున జరిమానా విధించి, మూడు లారీల ఇసుకను తహసీల్దార్ కార్యాలయంలో డంప్ చేయించారు.

ఖాతాలో నగదు మాయం

పాల్వంచ: వ్యక్తి ఖాతాలోని నగదును సైబర్ నేరగాళ్లు మాయం చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొత్తసూరారంకు చెందిన భూక్యా అఖిల్ కుమార్ తన సోదరి వివాహం ఈ నెల 21వ తేదీన ఉండటంతో రూ.2 లక్షల నగదును అప్పుగా తెచ్చి బ్యాంక్‌లో ఉంచాడు. అయితే, తన సెల్ ఫోన్‌కు ఓ లింక్ వచ్చి అప్‌డేట్ చేయాలని తెలపడంతో అదేవిధంగా చేశాడు. కొద్ది సేపటికి రూ.54వేలు, రూ.49 వేలు, రూ.50వేలు, రూ.44 వేలు చొప్పున నగదు ఖాతాలో నుంచి కట్ అయినట్లుగా మెసేజ్‌లు వచ్చాయి. కంగారు పడిన అఖిల్ వెంటనే బ్యాంక్‌కు వెళ్లి చూడగా నగదు మాయం అయినట్లు గుర్తించాడు. సైబర్ నేరగాళ్లు నగదును కొట్టేసినట్లు నిర్ధారణకు వచ్చి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మహాదేవపురం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన సొందె రాజు, కారం రవి, కల్లూరి మహేశ్ డిగ్రీ పరీక్షల నిమిత్తం బైక్‌పై భద్రాచలం వెళ్లి ఇంటికి తిరిగివస్తున్నారు. ఈ క్రమంలో తూరుబాక గ్రామంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడింది. దీంతో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు కావడంతో గ్రామస్తులు 108లో భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. వారిలో సొందె రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

యువతి అదృశ్యం

పాల్వంచ: షాపింగ్‌మాల్‌లో పని నిమిత్తం వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయిందని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. నవభారత్ గాంధీనగర్‌కు చెందిన యువతి అంబేడ్కర్ సెంటర్ వద్ద గల ఓ షాపింగ్‌మాల్‌లో పనిచేస్తోంది. బుధవారం పనినిమిత్తం ఇంటి నుంచి వెళ్లి మధ్యాహ్నం తర్వాత కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్పంచ్‌ల సతమతం..

- నిధులు లేక ఎక్కడికక్కడే ఆగిన పనులు
- పాలనకు ఇంకా 41 రోజులే గడువు
- బిల్లుల చెల్లింపుల జాప్యంపై ఆందోళన



నేలకొండపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

నేలకొండపల్లి: పంచాయతీల్లో నిధుల్లేక పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. చెత్త తరలించే ట్రాక్టర్లు ఇంధనం నింపడానికి డబ్బులేవు. గుప్పెడు బ్లీచింగ్ పౌడర్ చల్లలేని పరిస్థితి నెలకొంది. 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులను గత ప్రభుత్వం తీసుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి నిర్వహణకు ముందుగా నిధులు ఖర్చు చేసి బిల్లులు పెట్టాల్సి ఉంటుంది. వీటితో పాటు మన ఊరు - మన బడి, పల్లె ప్రగతి పనులకు కూడా ప్రజాప్రతినిధులే ఖర్చుచేశారు. పనులు పూర్తయ్యాక అధికారులు పరిశీలించాల్సి ఉంది. బిల్లులు కార్యదర్శులు ఖజానాకు అప్‌లోడ్ చేసిన తరువాత కార్యదర్శి, సర్పంచ్‌లు సంయుక్తంగా సంతకం చేసి నిధులు తీసుకోవాల్సి ఉంటుంది. ఖజానాలో ఏడాదికి పైగా సరిపడా నిధుల్లేక సర్పంచ్‌లు, అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. పంచాయతీల్లో చిన్న సమస్యల పరిష్కారానికి ఉపయోగించే సాధారణ నిధులు (జనరల్ ఫండ్) సైతం లేక సర్పంచ్‌లు ఏమీ చేయలేకపోతున్నారు. ఖమ్మం జిల్లాలో 589, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 479 గ్రామ పంచాయతీల్లో చాలామంది సర్పంచ్‌లు రూ.లక్షలు అప్పు చేసి అభివృద్ధి పనులు చేశారు. కొన్ని చోట్ల చెక్కులు పంపించినప్పటికీ పాసింగ్ కాక నానా అవస్థలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.కోట్ల పెండింగ్ బిల్లుల వస్తాయా? లేదా అనే అనుమానంతో సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు.

కౌంట్‌డౌన్ ప్రారంభం..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు పదవీ కాలం ముగిసే గడువు దగ్గరకు వచ్చింది. జనవరి 31తో వారి పదవీ కాలం అయిపోతుండటంతో చేసిన పనులకు బిల్లుల పరిస్థితి ఏమిటో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. పాలకవర్గాలు ఏర్పడిన తరువాత కరోనా వెంటాడి రెండేళ్ల పాటు ఏమీ చేయలేని పరిస్థితిలో సర్పంచ్‌లు ఉన్నారు. మిగతా సమయంలో అప్పటి పాలకులు పంచాయతీలను చిన్న చూపు చూశారని సర్పంచ్‌లు మండిపడుతున్నారు. ఒక పక్క పాలకవర్గాల గడువు ముంచుకొస్తోంది. కేవలం 41 రోజులు మాత్రమే గడువు ఉంది. ప్రతీ పంచాయతీ సర్పంచ్ అప్పులు చేసి అభివృద్ధి చేసిన వాటికి బిల్లులు రాకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. ఈలోగా బిల్లుల బకాయిలు చెల్లించకుంటే ఎన్నికల తరువాత కొత్త, పాత వారికి మధ్య భేదాభిప్రాయాలతో పల్లెల్లో మరో పంచాయితీ మొదలయ్యే అవకాశాలు ఉంటాయిని పలువురు చెబుతున్నారు.

గడువు పెంచాలి..



కరోనా వల్ల పాలకవర్గం రెండేళ్ల పాటు ఏమీ చేయకుండానే గడిచింది. కొత్త ప్రభుత్వం పాలకవర్గాలకు మరో ఏడాది పాటు అవకాశం కల్పించాలి. పెండింగ్‌లో ఉన్న పనులు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం గడువును పెంచాలి.

– గండు సతీశ్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, నేలకొండపల్లి

బకాయిలు వెంటనే చెల్లించాలి..



జిల్లాలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లను అధికారులు బెదిరించి పనులు చేయించారు. కానీ, బిల్లుల చెల్లింపు విషయంలో మాత్రం పట్టించుకోవటం లేదు. కొత్త ప్రభుత్వం వెంటనే సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బకాయిలను చెల్లించే ఏర్పాట్లు చేయాలి.

– దండా పుల్లయ్య, సర్పంచ్, రాజేశ్వరపురం

సర్పంచ్‌లను అవమానించింది..



గత ప్రభుత్వం పంచాయతీల్లో ఇతరులకు పెత్తనం అప్పగించి సర్పంచ్‌లను అవమానించింది. చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదు. పంచాయతీలకు ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. కొత్త ప్రభుత్వం సర్పంచ్‌ల ఆశలు నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– ఈవూరి సుజాత, సర్పంచ్, చెరువుమాధారం

‘గుప్త నిధుల’ ముఠా అరెస్ట్

- రూ.30.46 లక్షలు, కారు సీజ్
- వివరాలు వెల్లడించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెంరూరల్: గుప్త నిధుల పేరు చెప్పి రూ.50 లక్షలు తీసుకున్న ముఠా గుట్టురట్టయింది. ఈ ముఠాలో ప్రధాన నిందితుడితోపాటు ఐదుగురు సభ్యులను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను బుధవారం లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ రెహమాన్ వెల్లడించారు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన బోయిన బుచ్చయ్య, వేల్పుల కిరణ్, కనకటి లింగయ్య కలిసి గొర్రెల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలానికి చెందిన మానికల కృష్ణ, అతడి స్నేహితులు ధర్మసోత్ శ్రీను, గూడవల్లి ప్రశాంత్, ఎల్.రవి, తేజావత్ శివ, బానోత్ నరేశ్, నేల్లుల వెంకన్న, లక్ష్మణ్, భూక్య నాగ, తేజావత్ రాము, ధరావత్ రవి.. పాల్వంచ దగ్గర గొర్రెల మంద ఉందని బుచ్చయ్యకు సమాచారం ఇవ్వడంతో ఆయన కిరణ్, లింగయ్యను తీసుకొని వచ్చాడు. గొర్రెలు ఏవని కృష్ణను అడగటంతో ఇంకా రాలేదని, మళ్లీ వచ్చినప్పుడు పిలుస్తామని బదులిచ్చాడు. అయితే, తాము ఇక్కడికి రావడానికి రూ.18,750 ఖర్చయిందని బుచ్చయ్య చెప్పడంతో కృష్ణ ఆ నగదును ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. మరో రోజు కృష్ణ గొర్రెలు వచ్చాయని బుచ్చయ్యకు చెప్పడంతో మళ్లీ వారు ముగ్గురు కొత్తగూడెం వచ్చారు. వారిని లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం గ్రామానికి తీసుకెళ్లి తమ దగ్గర గొర్రెలు లేవని, గుప్త నిధులకు సంబంధించి రూ.2 కోట్లు ఉన్నాయని, రూ.50 లక్షలు ఇచ్చి ఈ నగదు తీసుకెళ్లండని కృష్ణ చెప్పాడు. ఈ క్రమంలో రూ.50 వేలు కూడా బుచ్చయ్యకు ఇచ్చాడు. దీంతో వారు నమ్మి ఈ నెల 9వ తేదీన రూ.40 లక్షలు తీసుకొచ్చి కృష్ణకు అప్పగించి రూ.2 కోట్లు ఉన్న సంచులను తీసుకుని బుచ్చయ్య, కిరణ్, లింగయ్య అక్కడి నుంచి వెళ్లారు. మార్గమధ్యలోకి వెళ్లి చూసుకోగా డబ్బుల మధ్యలో తెల్లకాగితాలు పెట్టిన కట్టలు కనిపించాయి. వెంటనే వారు లక్ష్మీదేవిపల్లి పోలీసులను ఆశ్రయించడంతో మానికల కృష్ణ ముఠా గుట్టురట్టయింది. కాగా, బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి గ్రామం వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో మానికల కృష్ణతోపాటు ధర్మసోత్ శ్రీను, గూడవల్లి ప్రశాంత్, ఎల్.రవి, తేజావత్ శివ, బానోత్ నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఇదే ముఠాకు చెందిన నేల్లుల వెంకన్న, లక్ష్మణ్, భూక్య నాగ, తేజావత్ రాము, ధరావత్ రవి పరారీలో ఉన్నారని డీఎస్పీ రెహమాన్ వెల్లడించారు. కాగా, మానికల కృష్ణ.. 2011లో కొత్తగూడెం త్రీటౌన్‌లో రూ.20 వేలు, 2013లో వీఎంబంజరలో రూ.5 లక్షలు, 2013లో దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.50 లక్షలు, 2018లో తుంగతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.3 లక్షలు, 2017లో కూసుమంచిలో మోసాలకు పాల్పడ్డాడని, అతడు చేసిన మోసాలపై ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులు నమోదై ఉన్నాయని డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ పెద్దన్నకుమార్, ఎస్ఐలు సంతోష్, రాజమెగిలి, వెంకటేశ్వర్లు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓను కలిసిన ఐడీఓ

కొత్తగూడెంరూరల్: ఐడీఓ, ఎన్జీఓ ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ సభ్యులు వెంకట్రావు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శిరీషాను కలిశారు. జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవిపల్లి మండలంలోని పది గ్రామాలను పైలట్ ప్రాజెక్టు కింద తీసుకొని అక్కడ ఉన్న వారికి ఆధునిక పద్ధతిలో రక్తం తీయకుండా రక్తహీనత ఉన్న వారిని గుర్తించి వారికి చికిత్స, న్యూట్రిషన్ కిట్ ఇవ్వడం, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడానికి ప్రోత్సహించటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని డీఎంహెచ్ఓ శిరీషకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేందర్, డిప్యూటీ డెమో ఎండి ఫయాజ్‌మోహియుద్దీన్, నిర్మల ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీఈటీ

దమ్మపేట: మండలంలోని నాచారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు, అండర్–17 సాఫ్ట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం జగపతి బుధవారం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు రవికుమార్, పాండు, హర్షవర్ధన్, అభిలాష్, లోహిత్, జాష్టవి పాల్గొని, సత్తాచాటి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 21, 22, 23 తేదీల్లో నిర్మల్ జిల్లాలో జరిగే 67వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం వెల్లడించారు.

జాతీయస్థాయి పోటీలకు ఏకలవ్య విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

చర్లరూరల్: ఇటీవల రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన రెండో రాష్ట్రస్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ గేమ్స్, స్పోర్ట్స్‌లో చర్ల ఏకలవ్య స్కూల్ విద్యార్థులు సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ యం.శకుంతల తెలిపారు. అండర్–17 పురుషుల విభాగంలో వాలీబాల్‌లో ప్రథమస్థానం, ఫుట్‌బాల్‌లో ద్వితీయస్థానం, అండర్–14 వాలీబాల్‌లో ద్వితీయస్థానం, బాక్సింగ్‌లో ప్రథమస్థానం, లాంగ్‌జంప్‌లో ప్రథమస్థానం, ఆర్చరీలో ఓవరాల్ చాంపియన్‌షిప్, రెజ్లింగ్‌లో ద్వితీయస్థానంతో పాటు స్త్రీ, పురుషుల చెస్ విభాగంలో ప్రథమస్థానం సాధించిన కె.అజయ్‌కుమార్, బి.రూపు, ఇ.మోహన్, పి.రాధాకృష్ణ, బి.శశిధర్, వి.జితేందర్, ఎస్.అజయ్‌తేజ, ఎం.భరత్‌చంద్ర, కె.పార్థు, కె.శ్రీవల్లి, యస్.శ్రీవిద్య, వాణిశ్రీ, బి.రాహరి, బి.మోక్షశ్రీ, దివ్యశ్రీ, కె.శ్రావణ్‌కుమార్, కె.నందిని, హర్షిత, పావని లను డాక్టర్ నవీన్‌నికోలస్, చంద్రశేఖర్, వీర్యానాయక్, ఈ.జ్యోతి, వెంకటేశ్, పి.అరుణ అభినందించారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి

దమ్మపేట: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బుధవారం రాత్రి మండలంలోని పెద్దగొల్లగూడెం గ్రామ శివారులో రోడ్డుపై ఆగి ఉన్న లారీలో చెరకు పంటను లోడ్ చేస్తున్నారు. ఇదే సమయంలో పెద్దగొల్లగూడెం గ్రామానికి చెందిన రావుల శ్రీను, బేతి నాగబాబు ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై సొంత ఊరు నుంచి పార్కలగండి గ్రామం వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్దగొల్లగూడెం గ్రామ శివారులో ఆగి ఉన్న చెరకు లోడ్ లారీని వెనుక నుంచి బైక్‌తో బలంగా ఢీకొట్టగా, తీవ్ర గాయాలతో వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

రహదారిపై చెట్లు నరికి వేసిన మావోయిస్టులు

చర్ల: జార్ఖండ్, బిహార్ రాష్ట్రాల్లో విప్లవోద్యమంపై కొనసాగుతున్న భద్రతా బలగాల దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో బుధవారం రాత్రి 63వ నంబర్ జాతీయ రహదారిపై పలుచోట్ల భారీ వృక్షాలను నరికి రోడ్డుకు అడ్డంగా వేశారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ఆంజనేయవర్షనే.. ప్రయాణికులు సమీప గ్రామాలకు చేరుకోవాలని సూచించారు. రహదారిపై చెట్లు నరికి అడ్డంగా వేయడంతో పాటు ఆ ప్రాంతంలో ఈ నెల 22న భారత్‌బంద్‌ను పాటించాలని కోరుతూ పెద్దఎత్తున వాల్‌పోస్టర్లు వేసి కరపత్రాలు వెదజల్లారు.

26 కేజీల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి బ్యాగులతో అధికారులు

బూర్గంపాడు: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి 26 కిలోల గంజాయిని పట్టుకున్నారు. మండలంలోని లక్ష్మీపురంలోని లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ వద్ద బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. లక్ష్మీపురంలోని ఓ లారీ ట్రాన్స్‌పోర్ట్ వద్ద ఓ వ్యక్తి మూడు బ్యాగులతో అనుమానాస్పదంగా సంచరిస్తున్నాడనే సమాచారంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఇది గమనించిన వ్యక్తి మూడు బ్యాగులను వదిలేసి అక్కడి నుంచి పరారయ్యాడు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆ బ్యాగులను పరిశీలించగా 26 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. గంజాయి విలువ రూ.6.50 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హరీశ్, సుధీర్, వెంకటేశ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి



వివరాలు నమోదు చేస్తున్న ఎస్ఐ రాజారాం

కరకగూడెం: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పినపాక మండలం ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన బంటు గోపమ్మ (60) మండలంలోని అనంతారం గ్రామంలో ఉన్న తన పెద్ద కుమార్తె సారమ్మ ఇంటికి ఆదివారం వచ్చింది. సోమవారం తన స్వగ్రామానికి తిరుగుప్రయాణమైంది. బుధవారం సాయంత్రం భట్టుపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రాళ్లవాగు బ్రిడ్జి వద్దకు బహిర్భూమికి వెళ్లగా బ్రిడ్జి కింద సదరు వృద్ధురాలు శవమై కన్పించడంతో వారు స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకున్నారు. వృద్ధురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ రాజారాం తెలిపారు. మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు కూడా ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

శేష తల్పమున సేదతీరి..

- బలరామావతారంలో దర్శనమిచ్చిన భద్రాచల రామయ్య
- కనుల పండువగా సాగుతున్న అధ్యయనోత్సవాలు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

భద్రాచలం: శేష తల్పమున సేద తీరి రెండు చేతుల్లో శంఖుచక్రాలు, మరో రెండు చేతుల్లో నాగలిని, గదను చేతబూని సీతాలక్ష్మమ్మలతో దర్శనమిచ్చిన బలరాముడికి భక్తజనం జేజేలు పలికారు. శ్రీహరికి శయన ఆదిశేషుని అంశతో జన్మించి, శ్రీకృష్ణునికి అన్నగా ఆయనకు ధర్మస్థాపనలో సహకరిస్తూ, అపర పరాక్రముడిగా పేరొందిన బలరామయ్య అవతారంలో స్వామివారిని భక్తులు కీర్తించారు. పగల్‌పత్తు ఉత్సవాలలో భాగంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి బుధవారం బలరామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ఆలయంలో తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాతం, ఆరాధన సేవలు జరిపారు. స్వామివారిని బలరామావతారంలో అలంకరించి బేడా మండపంలో కొలువుదీర్చగా భక్తులు దర్శించుకున్నారు. పండితులు ప్రబంధాలను పఠించి, హారతిని సమర్పించారు. అనంతరం మహిళల కోలాటం, బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారిని పల్లకీపై ఊరేగింపుగా మిథిలా స్టేడియం వద్దకు తీసుకొచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదిక వద్ద భక్తుల దర్శనార్థం ఉంచారు. అర్చకులు భక్తులకు స్వామి వారి ఆశీర్వచనాలను అందచేసి నైవేద్యాన్ని ప్రసాదంగా అందచేశారు. తిరువీధి సేవను ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు కృష్ణావతారంలో దర్శనం

అధ్యయనోత్సవాలలో భాగంగా రామయ్య గురువారం శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవకీ వసుదేవులకు అష్టమ సంతానంగా జన్మించి, దుష్టులైన కంసుడు, నరకాసురుడు, శిశుపాలుడు మొదలైన వారిని వధిస్తాడు. ధర్మవర్తనులైన పాండవుల పక్షం వహించి, కురుక్షేత్ర సంగ్రామంలో ఉపనిషత్తుల సారాంశమైన భగవద్గీతను అర్జునునికి బోధించి మానవ ఆదర్శాలను, ధర్మాన్ని స్థాపించిన శ్రీమన్నారాయణుడి పరిపూర్ణ అవతారం శ్రీకృష్ణావతారం. చంద్రగ్రహ బాధలున్న వారు ఈ అవతారాన్ని దర్శించడం వల్ల శుభ ఫలితాలను పొందుతారని ప్రతీతి.

డిప్యూటేషన్ల రద్దును నిలిపివేయాలి



జడ్జి వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: ఖమ్మం జిల్లా నుంచి డిప్యూటేషన్లపై 18 మంది సిబ్బందిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పంపగా హైకోర్టు ఈ నెల 14న ఈ డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని, కానీ, డిప్యూటేషన్లను యథాతథంగా కొనసాగించేలా చూడాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, తెలంగాణ హైకోర్టు జడ్జి ఈవీ వేణుగోపాల్‌ను హైకోర్టులోని ఆయన చాంబర్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌కుమార్‌మక్కడ్ ఆధ్వర్యంలోని బృందం సభ్యులు కలిశారు. ఆయన్ను సన్మానించిన అనంతరం వినతి పత్రం అందించారు. అనంతరం భద్రాద్రి వాసి జస్టిస్ నగేశ్ భీమపాకను కలిసి సమస్య తీవ్రతను వివరించగా.. ఆయన కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పినట్లు న్యాయవాదులు తెలిపారు. అనంతరం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ (అడ్మిన్) బాలభాస్కర్‌ను సైతం కలిశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ములకలపల్లి: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కొత్తగూడెం అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన క్రీడా పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. 600 మీటర్ల పరుగుపందెంలో టి.దివ్యశ్రీ (అండర్–16), పి.అఖిలసాయి (అండర్–14) బంగారు పతకాలు సాధించారు. ఎస్.భావన (అండర్–16), పి.లోహిత (అండర్–12) వెండి పతకాలు, టి.దివ్యశ్రీ (అండర్–16), టి.హర్షిత (అండర్–14) రజత పతకాలు సాధించారు. లాంగ్‌జంప్ విభాగంలో కె.ఇందు వెండి పతకం సాధించింది. కబడ్డీ పోటీల్లో (అండర్–17) ప్రణతిశ్రీ, సుమాంజలి, విజయకుమారి రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానం దక్కించుకున్నారు. అండర్–17 విభాగంలో హాకీ, సాఫ్ట్‌బాల్ పోటీల్లోనూ రాష్ట్రస్థాయి పోటీల్లో స్థానం దక్కించుకున్నట్లు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. విజేతలను పీడీ నాన్సీ, పీఈటీ సుజాత, సిబ్బంది అభినందించారు.

క్లుప్తంగా...



సీఎం జగన్‌కు అక్షరమాల!

సీఎం జగన్ పుట్టిన రోజును పురస్కరించుకొని నంద్యాలకి చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్.. అక్షరాలతో జగనన్న జీవిత చరిత్రను వేశారు. ఏ 3 డ్రాయింగ్ షీట్‌పై మైక్రో పెన్నుతో సీఎం జగన్ పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్న విషయాలను చిత్రంలో రాశారు. వైఎస్సార్ మృతి, ఓదార్పు యాత్ర, ప్రజాసంకల్ప యాత్ర, సీఎంగా ప్రమాణస్వీకారం, నవరత్నాలు తదితరాలను చిత్రంలో చూపించారు. – నంద్యాల(అర్బన్)

22న 'టైంస్లాట్ టోకెన్లు' రద్దు

అదే రోజు మధ్యాహ్నం నుంచి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో 'వైకుంఠ'టోకెన్ల జారీ

తిరుమల: శ్రీవారి ఆలయంలో డిసెంబర్ 23–జనవరి 1 వరకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు టీటీడీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 22న అదేరోజు శ్రీవారి దర్శనానికి సంబంధించి తిరుపతిలో మంజూరు చేసే సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లను రద్దు చేసింది. భక్తులు తిరుమలలో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా సర్వదర్శనంలో ఆరోజు శ్రీవారిని దర్శించుకోవచ్చు. 22న మధ్యాహ్నం 2 గంటల నుంచి తిరుపతిలోని 9 ప్రాంతాల్లో వైకుంఠ ద్వార దర్శన టోకెన్లను జారీ చేయనుంది. 23న ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ మాడ వీధుల్లో దర్శనమిస్తారు. నాదనీరాజనం వేదికపై సంపూర్ణ భగవద్గీత అఖండ పారాయణం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తారు. 24న తెల్లవారుజామున శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్ల చక్రస్నాన మహోత్సవం జరుగనుంది. డిసెంబర్ 22–24 వరకు, డిసెంబర్ 31, జనవరి 1వ తేదీల్లో శ్రీవారి ఆలయంలో ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. స్వయంగా వచ్చే ప్రోటోకాల్ వీఐపీలకు, కుటుంబ సభ్యులకు మాత్రమే పరిమిత సంఖ్యలో బ్రేక్ దర్శనం ఇవ్వనుంది.

ఆరోగ్యానికి ఆట బాట

రెండు ప్రధాన లక్ష్యాలతో బెంచ్‌మార్క్‌లా 'ఆడుదాం ఆంధ్ర' • గ్రామీణుల్లో ఆరోగ్యకర జీవనానికి వ్యాయామం, క్రీడల వైపు ప్రోత్సాహం

- మట్టిలో మాణిక్యాలను అంతర్జాతీయ వేదికలపై నిలబెట్టడమే లక్ష్యం
- 26 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 47 రోజుల పాటు క్రీడా సందడి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పీవీ సింధు ఇతర క్రీడాకారులు. చిత్రంలో మంత్రి రోజా

సాక్షి, అమరావతి: క్రీడా రంగంలో 'ఆడుదాం ఆంధ్ర'కార్యక్రమాన్ని బెంచ్ మార్క్‌లా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. దీనిద్వారా గ్రామాల్లో ఆరోగ్యకర జీవనాన్ని పెంపొందించడంలో భాగంగా వ్యాయామం, క్రీడలను ప్రోత్సహించడం ఒక ప్రధాన కారణమైతే.. మట్టిలోని మాణిక్యాల ప్రతిభను వెలికితీసి ప్రపంచ వేదికలపై నిలబెట్టే మహోన్నత ఉద్దేశంతో ఐదు రకాల క్రీడాలను ప్రమోట్ చేస్తున్నామన్నారు. ఈ రెండు ప్రధానాంశాలే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మెగా క్రీడాటోర్నీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఏటా డిసెంబరులో 'ఆడుదాం ఆంధ్ర'ను నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈనెల 26వతేదీ నుంచి ఫిబ్రవరి 10 వరకు 47 రోజుల పాటు పండుగ వాతావరణంలో క్రీడా పోటీలు చేపట్టాలని నిర్దేశించారు. త15 వేల గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రకు అన్ని రకాలుగా సన్నద్ధమవ్వాలని సూచించారు. బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ముఖ్యమంత్రి జగన్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

ఐదు రకాల క్రీడలు..

ప్రజారోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. విలేజ్ క్లినిక్స్ ద్వారా ప్రివెంటివ్ కేర్‌పై దృష్టి పెట్టాం. ప్రివెంటివ్ కేర్ మరింత సమర్థంగా పని చేయాలంటే నిత్యం వ్యాయామం అవసరం. ప్రివెంటివ్ కేర్‌లో భాగంగా ప్రతి ఇంటిలో ఫిజికల్ యాక్టివిటీస్ పెరిగితే భవిష్యత్తులో అవన్నీ తగ్గుతాయి. అందుకే ఆడుదాం ఆంధ్రను ప్రాముఖ్యత ఉన్న అంశంగా గుర్తించాలి. గ్రామీణ క్రీడాకారులకు సరైన గుర్తింపు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కుతుంది. ఇందులో భాగంగానే ఐదు రకాల క్రీడలు.. క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో ప్రమోట్ చేయాలి. ప్రతిభగల క్రీడాకారులకు ఉన్నతస్థాయి శిక్షణ అందించే దిశగా అడుగులు వేయాలి. పోటీల ప్రారంభానికి ముందే అన్ని స్థాయిల్లో పెద్ద ఎత్తున పండుగ వాతావరణంలో సన్నాహక కార్యక్రమాలు చేపట్టాలి. 3 కిలోమీటర్ల మారథాన్ లాంటి కార్యక్రమాలు జిల్లా స్థాయిలో నిర్వహించాలి.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ప్రతిభకు నగదు బహుమతి

క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రథమ విజేతలకు రాష్ట్రస్థాయిలో రూ.5 లక్షలు, జిల్లాలో రూ.60 వేలు, నియోజకవర్గంలో రూ.35 వేలు చొప్పున నగదు బహుమతి ఇస్తున్నాం. ఈ క్రీడలకు సంబంధించి ద్వితీయ బహుమతి కింద రాష్ట్ర స్థాయిలో రూ.3 లక్షలు, జిల్లాలో రూ.30 వేలు, నియోజక వర్గంలో రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.2 లక్షలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున అందజేస్తాం. బ్యాడ్మింటన్ డబుల్స్ విజేతలకు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి రూ.2 లక్షలు, జిల్లాలో రూ.35 వేలు, నియోజకవర్గంలో రూ.25 వేలు, ద్వితీయ బహుమతి కింద వరుసగా రూ.లక్ష, రూ.20 వేలు, రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు అందచేస్తాం.

రాష్ట్ర విద్యుత్ రంగంలో మరో మైలురాయి

ఎన్‌టీటీపీఎస్‌లో 8వ యూనిట్ ప్రారంభం.. 800 మె.వా వాణిజ్య ఉత్పత్తికి శ్రీకారం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పాదన సంస్థ (ఏపీజెన్‌కో) మరో మైలురాయిని అధిగమించింది. ఇబ్రహీంపట్నంలోని డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డాక్టర్ ఎన్‌టీటీపీఎస్)లోని 8వ యూనిట్ వాణిజ్య ఉత్పత్తికి విజయవంతంగా శ్రీకారం చుట్టింది. కొత్తగా నిర్మించిన 800 మెగావాట్ల ఎనిమిదో యూనిట్ 72 గంటలపాటు నిర్విరామంగా వందశాతానికిపైగా సామర్థ్యంతో పనిచేయడంతో.. బుధవారం ఉదయం 10.45 గంటలకు విద్యుత్ వాణిజ్య ఉత్పత్తి (కమర్షియల్ ఆపరేషన్ డేట్– సీవోడీ) ప్రారంభమైంది. ఏపీజెన్‌కో ఎండీ, ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు సమక్షంలో సంస్థ డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, సిబ్బంది హర్షధ్వానాల మధ్య ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో, ఏపీపీసీసీ, ఏపీ డిస్కంల ప్రతినిధులు బుధవారం ఉదయం సీవోడీ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని 1,760 నుంచి 2,560 మెగావాట్లకు పెంచుకుని ఏపీజెన్‌కోలో డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ అతి పెద్ద ఉత్పత్తి కేంద్రంగా ఆవిర్భవించింది. డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లో స్టేజ్–5 కింద 800 మెగావాట్ల సామర్థ్యంతో సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన ఎనిమిదో యూనిట్ కోవిడ్ లాంటి కష్టకాలాన్ని, అనేక సవాళ్లను అధిగమించి వాణిజ్య ఉత్పత్తి సాధించింది. ఈ సందర్భంగా సంస్థ ఎండీ కేక్ కట్‌చేసి, కొత్త యూనిట్ నిర్మాణంలో భాగస్వాములై సేవలందించిన పలువురిని జ్ఞాపికలతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా సంపూర్ణ సహాయ సహకారాలు అందించడంవల్లే ఎనిమిదో యూనిట్ నిర్మాణపనులు పూర్తిచేసి సీవోడీ చేసుకోగలిగామని ఏపీజెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు చెప్పారు. సీఎం వైఎస్ జగన్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రోత్సహించడంవల్లే ఇది సాధ్యమైందన్నారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి అందించిన సహకారానికి ధన్యవాదాలు తెలిపారు.

8,789 మెగావాట్లకు పెరిగిన జెన్‌కో సామర్థ్యం

డాక్టర్ ఎన్‌టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల ఎనిమిదో యూనిట్ సీవోడీతో జెన్‌కో థర్మల్ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 6,610 మెగావాట్లకు పెరిగింది. జెన్‌కో మొత్తం ఉత్పాదన సామర్థ్యం 8,789 మెగావాట్లకు పెరిగింది. ప్రస్తుతం జెన్‌కోకి 6,610 మెగావాట్ల థర్మల్, 1,773.600 మెగావాట్ల హైడల్, 405.426 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పాదన సామర్థ్యం ఉంది. మొత్తం రాష్ట్ర గ్రిడ్ డిమాండ్‌లో 55 నుంచి 60% వి ద్యుత్ అందించే సామర్థ్యం ఏపీ జెన్‌కోకు వచ్చింది.

నిస్సహాయుల పట్ల కరుణ చూపాలి..

- ఆకాశమంత సహనం ఉండాలి
- అప్పుడే దేవుడికి నచ్చిన బిడ్డలుగా ఉంటాం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: నిస్సహాయుల పట్ల కరుణ చూపించడం, ఆకాశమంత సహనంతో మెలగడం.. ప్రతి మనిషి అలవాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. అప్పుడే మనం దేవుడికి నచ్చిన బిడ్డలుగా ఉంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఘనంగా నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్రైస్తవ మత పెద్దలతో కలిసి కేక్ కట్‌చేసి, క్యాండిల్స్ వెలిగించి తెలుగు రాష్ట్రాల ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'క్రిస్మస్ పండుగ వస్తున్న శుభసందర్భంలో ఈ సాయంత్రం పూట అడ్వాన్స్‌గా క్రిస్మస్‌ను జరుపుకొంటున్నాం. ఈ మంచి రోజులో ఇక్కడికి వచ్చిన అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలే కాకుండా మొత్తం తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి మీ అన్నగా, తమ్ముడిగా మెర్రీ క్రిస్‌మస్ ఇన్ అడ్వాన్స్ తెలియజేస్తున్నాను. దేవుని విషయంలో మనందరికీ తెలిసిన ఒక్కటే ఒక్క విషయం... మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ చూపించడం. ఆకాశమంత సహనం ప్రతి మనిషిలోనూ అలవాటు చేసుకోవడం. అవధులు లేని త్యాగం, మరీ ముఖ్యంగా శత్రువుల పట్ల కూడా క్షమాగుణం. ఇవన్నీ కష్టమైన విషయాలు అయినప్పటికీ ఆ ప్రతి విషయాన్ని మనం ఎప్పుడు గ్రహిస్తామో, ఎప్పుడైతే వాటిని మనసారా పాటించాలని తాపత్రయపడతామో.. అప్పుడు మనం కూడా దేవుడు నచ్చిన బిడ్డలుగా ఉంటాం. దేవుడు ఆ మనసు మనందరికీ ఇవ్వాలని, రాష్ట్రాన్ని, ప్రజలను ఆశీర్వదించాలని మనసారా కోరుకుంటూ క్రిస్మస్ సందర్భంగా ఇక్కడున్నవారితోపాటు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న అందరికీ మరోసారి మెర్రీ క్రిస్మస్ తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నా..'అని చెప్పారు. రాష్ట్రంలో పలు రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారిని సీఎం వైఎస్ జగన్ సన్మానించి, అవార్డులు అందజేశారు. క్రిస్మస్‌ను పురష్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఇచ్చిన విందులో క్రైస్తవ మతపెద్దలు, దైవసేవకులతో కలిసి సీఎం జగన్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్ జన్మదిన వేడుకలు

- తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ సంబరాలు

సాక్షి,అమరావతి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు పురస్కరించుకుని ఈనెల 21 (గురువారం) రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో భారీఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఘనంగా ఏర్పాట్లుచేశాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మొక్కలు నాటడంతో పాటు అన్నదానం, వస్త్రదానాలు చేయనున్నారు. అలాగే, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేస్తారు. రక్తదాన శిబిరాలు కూడా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకులు, శాసనమండలిలో ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కోట్లాది మంది అభిమానులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు సైతం పాల్గొంటారన్నారు. అలాగే, వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద గురువారం ఉ.9.30 గంటలకు దివంగత సీఎం వైఎస్సార్‌కి నివాళి అర్పించడంతో కార్యక్రమాలు మొదలవుతాయని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సాంస్కృతి కార్యక్రమాలు, కేక్ కటింగ్, దుస్తులు, బహుమతుల పంపిణీ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఇక ఇప్పటికే రెండ్రోజులు ముందే దేశ, విదేశాల్లో వైఎస్సార్‌సీపీ అభిమానులు ఎన్నో సేవా కార్యక్రమాలు ప్రారంభించారని అప్పిరెడ్డి చెప్పారు.

బాబు ముందస్తు బెయిల్‌పై ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలకు నేరస్వభావాన్ని ఆపాదించడానికి వీల్లేదని చంద్రబాబు తరపు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ అగర్వాల్ హైకోర్టుకు నివేదించారు. ఉచిత ఇసుక విధానంలో తప్పులు జరిగి ఉంటే కేసు నమోదుకు మూడేళ్లు ఎందుకు ఆగారని ప్రశ్నించారు. ఇన్నేళ్ల తరువాత కేసు ఎందుకు నమోదు చేశారన్న దానికి కారణాలు చెప్పడం లేదన్నారు. ఇసుక విధానం ద్వారా చంద్రబాబుకు లబ్ధిచేకూరినట్లు సీఐడీ ఎలాంటి ఆధారాలను చూపలేదని చెప్పారు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు విధానపరమైన నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. అందువల్ల అవినీతి నిరోధక చట్టం కింద చంద్రబాబును ప్రాసిక్యూట్ చేయాలంటే సెక్షన్ 17(ఏ) కింద గవర్నర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. పిటిషనర్ చంద్రబాబు వయసు, అనారోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉచిత ఇసుక పథకం పేరుతో కోట్ల రూపాయల మేర ఖజానాకు నష్టం కలిగించినందుకు సీఐడీ పలువురిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ చంద్రబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

జిల్లా వార్తలు

జేఎన్‌టీయూకే నుంచి డాక్టరేట్



తోటకూర వీరన్న

సత్తుపల్లిరూరల్: మండలంలోని గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీగా చేస్తున్న తోటకూర వీరన్న కాకినాడ జేఎన్‌టీయూకే నుంచి డాక్టరేట్ పొందారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో సిద్ధాంత వ్యాసాన్ని పరిశోధించగా ఆ ఫలితాలను అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన వీరన్నను కళాశాల చైర్మన్, ఎంపీ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి వర్చువల్‌గా అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ చెన్నుపాటి విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి తదితరులు కూడా అభినందనలు తెలిపారు.

టేబుల్ టెన్నిస్' మహిళా జట్టు ఎంపిక



జట్టుతో ప్రొఫెసర్ శ్రీనివాస రావు

కేయూ క్యాంపస్: చెన్నైలోని అమిటి యూనివర్సిటీలో ఈనెల 22 నుంచి 24 తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ టేబుల్ టెన్నిస్ పోటీలకు యూనివర్సిటీ నుంచి మహిళా జట్టును ఎంపిక చేసినట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పి.శ్రీనివాస రావు బుధవారం తెలిపారు. జట్టులో ఎం.వర్షిత, బి.ప్రగతి (హనుమకొండ, కిట్స్ కళాశాల), ఎ.కావ్య (టీటీడబ్లూ ఆర్‌డీసీ, కొత్తగూడెం) ఉన్నారని పేర్కొన్నారు. వీరికి కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాల వ్యాయామ అధ్యాపకురాలు డాక్టర్ కె సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారని శ్రీనివాసరావు తెలిపారు.

పశువులు లేవు.. పాడి రాదు..

నానాటికీ తరిగిపోతున్న పశుసంపద

- వ్యవసాయంలో యాంత్రీకరణతో జీవాల మనుగడకు ముప్పు
- పెంపకంపై శ్రద్ధ చూపని రైతులు, ప్రజలు
- ఆర్థికంగా ఎదిగే అవకాశమున్నా అంతంతగానే ఆసక్తి



పండితాపురం సంతలో అమ్మకానికి తీసుకొచ్చిన ఆవులు

కామేపల్లి: గ్రామాల్లో ఉదయమే అంబా అనే పశువుల అరుపులు వినపడటం లేదు. వ్యవసాయ పనుల్లో పశువులను ఎక్కువగా వినియోగించగా.. నేటి తరం రైతాంగం మాత్రం యంత్రాలపై ఆసక్తి కనబరుస్తోంది. కొన్నేళ్ల కిందటి వరకు పశువులు లేని రైతులు.. పాడి లేని ఇళ్లు కనిపించేవి కావు. కానీ ఇప్పుడు పశు పోషణ నానాటికీ తగ్గిపోతోంది. పశువులు ఉన్నవారు కూడా వ్యవసాయ పనులు పూర్తి కావడంతోనే సంతల్లో అమ్మేస్తున్నారు. పోషణ భారం కావడంతో పాటు కాపరుల లభ్యత లేక ఈ పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. అలాగే, బీడు భూములు లేక, వరి కోతకు యంత్రాల ఉపయోగిస్తుండటంతో గడ్డి లభించక పోవడం కూడా మరో కారణమని తెలుస్తోంది. ఫలితంగా స్వచ్ఛమైన పాలు లభించక ప్రజలు ప్యాకెట్ పాలపై ఆధారపడాల్సివస్తోంది. గతంతో పోలిస్తే పశుసంపద 70 శాతం తగ్గిందని రైతులు చెబుతున్నారు.

అత్యల్పం వేంసూరు.. అత్యధికం సింగరేణి

ఐదేళ్లకోసారి అధికారులు పశువుల వివరాలు సేకరిస్తారు. ఈ మేరకు 2019లో పశు సంవర్థక శాఖ అధికారులు చేపట్టిన గణాంకాల ప్రకారం ఖమ్మం జిల్లాలో ఆవులు 1,41,117 ఉండగా, గేదెలు 3,75,097 ఉన్నట్లు తెలుస్తోంది. వేంసూరు మండలంలో ఆవులు అత్యల్పంగా 1,253 మాత్రమే ఉండగా సింగరేణి మండలంలో అత్యధికంగా 15,564 ఉన్నాయి. ఇక సింగరేణి మండలంలో అత్యల్పంగా గేదెలు 8,547 ఉండగా, పెనుబల్లి మండలంలో అత్యధికంగా 29,423 ఉన్నట్లు రికార్డుల ప్రకారం చెబుతున్నారు. అయితే, గణాంకాలు నమోదుచేసి నాలుగేళ్లు గడుస్తున్న నేపథ్యాన ఈ సంఖ్య మరింత తగ్గిపోయి ఉంటుందని సమాచారం.

ప్రభుత్వం ప్రోత్సహిస్తేనే ఫలితం

ప్రభుత్వం పశు సంపదను పెంచేలా రైతులను ప్రోత్సహిస్తే ఫలితం ఉండొచ్చు. పశు పోషణ, పెంపకంపై ఉత్సాహం ఉన్న వారికి రాయితీలపై పశువులను అందిస్తే వ్యవసాయ రంగాల్లో వినియోగించుకోవడంతో పాటు పాల ఉత్పత్తులపై దృష్టి సారించే అవకాశముంది. జీవాల పెంపకం కోసం ఇస్తున్న ప్రోత్సాహకాల మాదిరిగానే పశువుల పెంపకంపై రైతులకు అందించాలని పలువురు కోరుతున్నారు.

పశువులు తగ్గిపోయాయి..



గతంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా పశువులు ఉండేవి. వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరగడంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీనికి పశువుల పెంపకం భారంగా మారింది. దీంతో స్వచ్ఛమైన పాలు, వెన్న, నెయ్యి, పెరుగు లభించే పరిస్థితి లేదు.

–బానోత్ భీముడునాయక్, రైతు, పండితాపురం

స్వచ్ఛమైన పాలు దొరకడం లేదు..



గ్రామాల్లో స్వచ్ఛమైన పాలు దొరకడం లేదు. పశువుల పోషణ భారంగా మారి రైతులు ఆసక్తి చూపకపోవడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. పల్లె, పట్నం తేడా లేకుండా ప్యాకెట్ పాలు లభిస్తుండటంతో ప్రజలు కూడా వాటికే అలవాటు పడ్డారు.

–కొనకంచి శంకర్, రైతు, ఊట్కూర్

పశువుల పెంపకంపై దృష్టి సారించాలి



నేటి తరం రైతులు పశువుల పెంపకంపై దృష్టి పెట్టడం లేదు. వ్యవసాయ పనుల్లో ఆవులు, ఎద్దుల వినియోగం తగ్గింది. ఇకనైనా పశువుల పెంపకంపై దృష్టి సారిస్తే ఆర్థికంగా ఎదగవచ్చు. పశు పెంపకంలో నష్టాల కంటే లాభాలే ఎక్కువని తెలుసుకోవాలి.

–గోపాలకృష్ణ, ముచ్చర్ల పశు వైద్యాధికారి

'గుర్తింపు' ఎన్నికలపై నేడు విచారణ



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలను వాయిదా వేయాలని కోరుతూ ఈనెల 12న రాష్ట్ర ప్రభుత్వ ఎనర్జీ సెక్రటరీ హైకోర్టులో పిటీషన్ వేయగా, గురువారం విచారణ జరగనుంది. సింగరేణిలో ఈనెల 27న గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు ఏడు రోజుల గడువు మాత్రమే ఉండడంతో సింగరేణి యాజమాన్యం, కేంద్ర కార్మిక శాఖ ఉన్నతాధికారులు ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. బూత్‌ల వారీగా కార్మికుల ఓటర్ల జాబితాలు కూడా ఇప్పటికే సిద్ధమయ్యాయి.

ఎన్నికలు నిర్వహించాల్సిందే..

రాష్ట్రంలో ఇటీవల ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి ఎన్నికలను మార్చి వరకు వాయిదా వేయాలంటూ హైకోర్టును ఆశ్రయించింది. సింగరేణిలో తమ యూనియన్ ఐఎన్‌టీయూసీ ఎలాగైనా పట్టు సాధించాలని, అందుకోసం కొంత గడువు కావాలని భావిస్తోంది. అంతేకాక ఈనెల 19న సింగరేణి ఉన్నతాధికారులతో చర్చలు నిర్వహించిన ప్రభుత్వం.. ఎన్నికల వాయిదాకు బరిలో ఉన్న 13 కార్మిక సంఘాల నేతలు కూడా మద్దతు ప్రకటించేలా చూడాలని కోరింది. అయితే ఆయా సంఘాల నాయకులు మాత్రం ఈనెల 27నే ఎన్నికలు నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో కోర్టు తీర్పుపైనే అందరూ భారం వేసినట్లు సమాచారం.

అథ్లెటిక్స్ మీట్‌లో సత్తా చాటిన కేఎండీసీ



అథ్లెట్లను అభినందిస్తున్న కోటా అప్పిరెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్ : కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 18,19 తేదీల్లో నిర్వహించిన అథ్లెటిక్స్ మీట్‌లో నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కాలేజీ అథ్లెట్లు సత్తా చాటారు. పురుషుల 100 మీటర్ల పరుగులో కళాశాలకు చెందిన ఎ.గౌతమ్ ప్రథమ స్థానంలో, 800 మీటర్ల పరుగులో ఎస్.గోపీచంద్ ప్రథమ, 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం దక్కించుకున్నాడు. మహిళల విభాగంలో ఎస్‌కే ఆఫ్రీన్ ట్రిపుల్ జంప్‌లో ప్రథమ స్థానం, 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. కాకతీయ యూనివర్సిటీ ఉత్తమ అథ్లెట్‌గా ఎ.గౌతమ్ నిలిచాడు. కాకతీయ యూనివర్సిటీ క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను కళాశాల కరస్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, చైర్మన్ ఎం.నిరంజన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారావు, పీడీ జె.ఉపేందర్, అధ్యాపకులు అభినందించారు.

ఆ పాత మధురం..



శేషపాన్పు అలంకరణపై..



పడవపై తెప్పోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో ముక్కోటి ఉత్సవాలు ఎంతో ప్రత్యేకం. ముక్కోటి ఏకాదశికి ముందు రోజు పవిత్ర గోదావరి నదిలో సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యకు హంసవాహనంపై జరిగే తెప్పోత్సవాన్ని వీక్షించే కనులు పునీతం. పూర్వ కాలం నుంచి ఇప్పటి వరకు ఈ దృశ్యాలను దర్శించుకుని మదినిండా మధురానుభూతులను నింపుకుంటూ భక్తులు ఆధ్యాత్మిక తన్మయం పొందుతారు. తొలుత పడవలో, ఆ తర్వాత ఆదిశేషుని శేషపాన్పు ఆకారంలో, అనంతరం హంసాకృతిలో అలంకరించిన లాంచీలో స్వామివారు విహరించగా ఇప్పుడు బాణసంచా వెలుగులు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతుల నడుమ ఈ వేడుకను నిర్వహిస్తున్నారు. - భద్రాచలం

తెప్పోత్సవం తీరిలా..



గతంలో హంసాకృతి వాహనంపై ఇలా..



ప్రస్తుతం మిరుమిట్లు గొలిపేలా వేడుక..